# భగ్నజీవి.......

★ ముళ్ళపూడి సర్వేశ్వరరావు ★

లతా! ఇవాళ యింతాలస్యము చేసేవు!"

"మోహన్! ఇంకా ఆలస్యమా! తొందరగా పనులన్నియు ముగించి రోజూకంటే వేగంగా వచ్చాము కదూ!"

"ఏమో! అప్పుడే యెనిమి గంటలు కొచ్చింది. నీవిక రావేమో అనుకొని నిరాశతో వెళ్దామనుకుంటుంటే నీ దర్శనమైంది."

"ఇంతకన్నా వేగంగా యెలావస్తా మోహన్! ఇంట్లో మా అమ్మతో పొరుగింటికి వెళ్తున్నానని చెప్పేని యిక్కడికి రోజూ వస్తుండటము వల్ల అనుమానిస్తూనే యుంది- అలాంటప్పుడు యింకా త్వరగా వస్తే ప్రమాదం రాదూ!"

"పోనీ లతా! అయిందేదో అయింది! మరి అవలా దూరంగా కూర్చుంటే నాకేంతోస్తుంది- రా! యిలా దగ్గరగా రా!" అంటూ చేతులు వాచేడు-

"అదికాదు మోహన్! ఇవాళ నిన్నొక ప్రశ్న అడగాలని యుంది- దానికి జవాబు నీవు చెప్పేవరకూ నాకదోలా యుంటుంది."

"ఆ ప్రశ్న యేదో చంపక త్వరగా అడుకుదూ! నీ వడిగిన ప్రశ్నకు జవాబు చెప్పక పోతే యింకెవరి ప్రశ్నకు జ వా బు చెప్తాను లతా!"

"మొగవారిని నమ్మకూడదంటారు చాలా మంది!"

"ఓ! దీనికేనా! చెప్తానువిను- అందరూ యొక్కలాంటి మనుష్యులుకారు మనుష్యులలో చాల భేదముంది! లతా!"

"అదికాదు మోహన్! మొగవారందరూ అందనివరకూ కాళ్ళు అందగానే పిలక" అన్న పామెతిలా అవసరము తీరినవరకూ యిన్నాళ్ళ బ్రతిమాలుతారు అవసరము తీరగానే—"

"అదేమిలతా! యివాళ నీకు మతిపోయిందేమిటి! ఎప్పుడు అననిమాట లీనాడు నువ్వు ధారాళముగా పలుకుచున్నావు- అయినా అసలు నీకెందుకే అనుమాన మొచ్చింది!" అని ప్రక్కకు జరుగుతూ లతముఖమును పైకెత్తి ముంగురులు సవరిస్తూ అడిగాడు-

"విను మోహన్! ఇవాళ యేవోమాటల సందర్భములో మా అమ్మ మొగవారందరూ వంచకులు- అవసర మొచ్చినంత వరకూ కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలుతారు- అవసరము తీరిపోగానే బ్రతిమాలినా ముఖము చూడరు" అంది అప్పటినుంచీ మోహన్ కూడా ఇలాంటి వాడేనా అన్న ప్రశ్న నాకు తెలియకుండానే నాలో మొలకెత్తింది.

"లతా! ఇలాంటి ప్రశ్న నీలో పుట్టునని కలలో కూడ అనుకోలేదు- ఇన్నాళ్ళనుండి మన మన్యోన్య ప్రేమతో తరచు కలుసుకుంటున్నాము. ఇప్పటికైనా నా సంగతి నీవు గ్రహించలేకపోయావా! ఇలా నీవు నన్ను తలుస్తావని యెప్పుడూ అనుకోలేదు."

"అదికాదు మోహన్! మనమిలా రహస్యంగా కలుసుకోవడ మెవరైనా చూస్తే యేమను కొంటారు- నీకేమి మొగవాడివి- మా కొంపయుండనిస్తారా! అందుకే—"

"లతా! యివాళ నీవింత విపరీతముగా మాట్లాడడానికేదో కారణముండి తీరుతుంది- వేసేలంటి వాడినో తెలిసికూడ యిలా నీవు మాట్లాడుతావని

అనుకోలేదు- ఎవరైనా చూస్తారని భయమా! చూస్తే చూడనీ! అప్పుడే చాలమంది నాపై అనుమాన పడుచున్నారులే! నేనెలాగైనా నిన్ను తప్పకుండా పెళ్ళాడితీరుతానుగా! ఇంక వారనుమానిస్తే నాకేం, యిక చంపక—"

"మోహన్! మీరు గొప్పవాళ్ళు మేము బీదవాళ్ళము- అలాంటప్పుడు నీ తండ్రి మాతో వివాహమున కొప్పుకొనునా?"

"అబ్బా! యివాళ యిలా దంచేస్తున్నావు లతా! నీ కెందుకీ సందేహములు పుట్టినవో కాని యిదిగో చెప్తున్నాను విను- నా తండ్రి నీతో వివాహమున కొప్పుకొనక పోయినను బలవంతముగా నైనను యొప్పించి నిన్నే—"

"ఏమో! మనిషి యెదురుగుండా యున్నంత సేపు—"

"లతా! మరియిక చంపక ప్రశ్నలడగకు, నేనెలాగా నిన్ను తప్ప యింకెవ్వరినీ వివాహమాడనని చెప్పేనుకదా! ఇంక నీకు బెంగయెందుకు రా! యిక చంపక—"

లత యింకేమియు జబాబియ్యక, యూరుకొనుటచే 'మౌనము అర్థాంగీకార' మన్నట్లు మోహనుడు తలంచి ఆమెను మెల్లగా తన కౌగిలిలోనికి తీసుకొని తుమ్మెద రెక్కలులా యెగురుతున్న ముంగురులను సవరిస్తూ యుండెను- ఆమె మంత్రముగ్ధవలె మాట్లాడక అతని యొడిలో అర్థనిమీలిత నేత్రములతో పడియుండెను- కొంత సేపటివరకు ఆనందసాగరములో మునిగి వారిరువురును ఈ ప్రపంచమునే మరచిరి- లత మెల్లగా అతని కౌగలిని విడిపించుకొని "మోహన్! చాలా రాత్రియైనది. అమ్మ నా కొరకు యెదురుచూచుచుండును- నేనుపోయెద" నని చెప్పి ఆ చీకటిలో అదృశ్యమయ్యెను. మోహనుడామె పోయినదారివంక కొంతసేపు చూస్తూ తనుకూడ లేచిపోయెను-

... ... ..

మోహనుని తండ్రికాయూరునుండి బదిలీ యగుటచే ఆ యూరు వదలిపెట్టి పోయిరి- పోవుచున్నప్పుడు లతను అనేక విధములుగా మోహనుడొప్పించి తప్పకుండా పెళ్ళాడుతానని వాగ్దానముచేసి త్వరలోనే మళ్ళీ కలుసుకుంటానని చెప్పి విడువలేక వెళ్ళిపోయినాడు- ఆ యిరువురు ఒకరికొకరు విడువవలసిన సమయము వచ్చెను గదా యని చాల విచారించిరి-

మోహనుడా యూరు వదలిన దగ్గరనుంచి మతిచెడిన వాడిలా తయారయ్యేడు- తల్లి దండ్రులు వాని స్థితిని పరిశీలింపక పెళ్ళిచేస్తే బాగుపడతాడని సంబంధ మొకటి నిశ్చయపరచిరి- మోహనుడెన్ని చెప్పినను వారు వినలేదు- చివరికి వారెలాగా నన్ను బలవంతముగానైనను పెండ్లి చేయబోతున్నారని గ్రహించి లతను తను చాలా కాలమునుంచీ ప్రేమిస్తున్నానని, ఆమెను తప్ప యింకెవ్వరినీ పెండ్లాడనని చెప్పేడు- కాని ఏం లాభం! అప్పటికే అన్నీ సిద్ధమైనయి-

ఎప్పుడూ రాని పోస్టు బంట్రోతా నాడు తన యింటికి వచ్చుటచే లత మోహనుని దగ్గరనుండి యుత్తరము వచ్చినదనే యాశతో తానే వెళ్ళి యొక కవరుత్తరమును శుభలేఖను తీసుకొనెను- లత శుభలేఖలో లిఖింపబడిన యా యక్షరములను చూచి తన కళ్ళను తానే నమ్మలేక పోయెను- తల తిరిగినట్టాయెను- మరల మరల చూచుసరికి అనుకున్నంతా అయ్యెను- ఆ శుభమేలేఖ చూస్తునే కళ్ళంట నీళ్లు గిరగిర తిరిగి నునుపైన ఆచెక్కులనుండి ముత్యములుగా జలజలజారనారంభించెను ఇక ఆ శుభలేఖ వంక చూడలేక ఆ యుత్తరమందేమి యున్నదో ఈ ఆత్రముతో చింపి చూచుసరికి అందినట్లుండెను:

ప్రియమైన లతకు-

నిన్ను మనసార ప్రేమించి, నమ్మించి చివరికీ విధముగా ద్రోహము చేస్తున్నానని మరొక విధముగా తలంచకు, నిన్నెన్నో తీయని మాటలు చెప్పి నిన్ను తప్పకుండా వివాహమాడెదనని వాగ్దానము చేసితిని- కాని తల్లి దండ్రుల నొప్పిం

చలేక వారియొక్క మాటకెదురుచెప్పి తిరుగలేక పోగాకే పెండ్లి కొప్పుకొంటిని గాని మనసారా యొప్పుకొన్నానని తలంచకు.

ఏనాడు మన యిరువురము మొదట కలుసుకున్నామో ఆనాడే మనిద్దరకు వివాహమైనదనుకొంటిని. కాని దైవఘటన యిలా యుంటే యేం చేయగలము. ఈ శుభలేఖ చూడగానే నీవు నాపై పట్టరాని కోపము వచ్చియుండును కాని "తానొకటి తలంచిన దైవమొకటి తలంచు" నన్నట్లు ఈ ఘటనకును మనమేమి చేయగలము. అనవసరముగా నిన్ను నమ్మించి మోసపుచ్చినందులకు క్షమించెదనని నమ్ముచున్నాను. ఎప్పుడైనను మోహనుడు నీ ఆధీనుడే ఇంతకంటే మరేమియు వ్రాయలేదు. నా తప్పులన్నిటికి క్షమించ చేవనుకొను చున్నాను,

ఇట్లు,

"మోహన్"

ఆ యుత్తరము చదివి లత కళ్ళంట యేకధారగా ప్రవహించు నీళ్ళను తుడుచుకొనుచు, ఆనాడు తల్లి 'మొగవారిని నమ్మకూడదు' అన్న మాటలు జ్ఞప్తికి వచ్చి చేసినదానికి విచారపడిన లాభములేదని తలంచెను.

తనను పూర్తిగా నమ్మించి, చివరకీ విధముగా ద్రోహముచేసిన మోహనునకేక విధములుగా మనస్సులో దూషించి, ఇక తను జీవించుటకు బదులు ఈ శరీరమును విడుచుటే మంచిదని తలంచి 'ఈ జన్మలో కాకపోయినను మరుసటి జన్మలోనైనను మోహనునే భర్తగాచేయమని భగవంతుని ప్రార్థించుచు 'అంతవరకే సిద్ధముగా యుంచుకొన్న విషమును త్రాగి ప్రాణములు పోగొట్టుకొనెను.

...... ......


# ఆనందవాణి

పోస్టుబాక్సు నెం. 1583

12, తంబుచెట్టి వీథి, మదరాసు

★

(ప్రచురణ : ప్రతి ఆదివారం)

సాలుచందా .... రు. 14/-

అర్ధసంవత్సర చందా రు. 7-8-0

(తపాలు వ్యయంతో సహా)

★

* అర్ధసంవత్సరముకంటె తక్కువ కాలానికి చందా అంగీకరింపబడదు
* 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం

## చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలుపవలెను. లేకుంటే జవాబు ఆలస్యమవుతుంది. మనియార్డర్లు మేనేజరు, ఆనందవాణి ఆఫీసు, 12 తంబుచెట్టివీధి, జి.టి. మద్రాసు అని వ్రాయవలెను. వ్యక్తుల పేర పంపవద్దు.

— మేనేజరు